క్లుప్తంగా

నేడు వేలంపాట

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీ పరిధిలోని పంచాయతీ షాపులకు సంబంధించి, శుక్రవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు మేజరు పంచాయతీ ఈఓ రామచంద్రరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. బస్సు, కారు స్టాండ్‌లతో పాటు పాతబస్టాండ్‌లోని మరో ఆరు షాపులు, 9వ ప్లాట్, 10వ ప్లాట్, పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న 8 షాపులకు వేలంపాట నిర్వహిస్తామన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు ఉదయం 11 గంటలకు కార్యాలయానికి హాజరు కావాలని కోరారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



కాలువల దగ్గర దోమల నివారణకు స్ప్రే చేయిస్తున్న సిబ్బంది

భామిని: మండలంలోని నేరడి–బి, గురండి గ్రామపంచాయతీల్లో కార్యదర్శి అనసూయ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా చేపట్టారు. ప్రధాన వీధులు, కాలువల్లో పేరుకు పోయిన చెత్తాచెదారం, మురుగును పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. అనంతరం బ్లీచింగ్ చల్లారు. మరికొన్నిచోట్ల దోమల నివారణకు స్ప్రేయింగ్ చేపట్టారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం నీరజ, తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీలో ప్రతిభ



ఎ.నాగదేవిశ్రీ



కె.శిరీష



డి.ప్రియాంక



బి.శరణ్య మధురిమ

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఏపీపీఎస్సీ(ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచారు. 2021లో జరిగిన ఈ పరీక్ష ఫలితాలు ఇప్పుడు విడుదల కాగా, 2016 బ్యాచ్‌కు చెందిన ఎ.నాగదేవిశ్రీ, 2017 బ్యాచ్‌కు చెందిన కె.శిరీష, డి.ప్రియాంక, బి.శరణ్య మధురిమ ఉత్తీర్ణత సాధించి, ఉద్యాన కళాశాల అధికారులుగా ఎంపికయ్యారు.

ప్రజల ఆరోగ్యంలో చిరుధాన్యాలపాత్ర కీలకం



జీగిరాంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సాలూరు: ప్రజల ఆరోగ్యంలో చిరుధాన్యాల పాత్ర చాలా కీలకమైనదని వెలుగు వీఓఏ రేణుక, ఎఫ్‌పీఓ నిర్మల అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని జీగిరాం గ్రామంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిరుధాన్యాలలో ఎన్నో పోషకాలు ఉన్నాయన్నారు. రైతులు చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ సాగు కోసం రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు గడువులోగా టీకాలు వేయించాలి



కాశీపేటలో అంగన్వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న డీఐఓ జగన్మోహన్‌రావు

సీతానగరం: విద్యార్థులు ప్రీ స్కూల్ పిల్లల్లో రక్తహీనత నివారణ దిశగా వైద్య అధికార సిబ్బంది సేవలందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ)అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పణుకుపేట, కాశీపేట గ్రామాల్లో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. పిల్లల్లో రక్తహీనత లోపించడానికి గల కారణాలు, వాటి లక్షణాలను, తీసుకోవాల్సిన నివారణా చర్యలపై అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. అనంతరం పిల్లలకు ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలు వేయించారు. కాశీపేట అంగన్వాడీ కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాల వల్ల ఉపయోగాలను వివరించారు.

సకాలంలో టీకాలు వేయడం వల్ల ఇతర వ్యాధులు దరి చేరవన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సమకూర్చిన పౌష్టి కాహారం సకాలంలో బాలింతలు ,ప్రీ స్కూల్ పిల్లలు, గర్భిణులకు పంపిణీ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే ఆరోగ్య పరీక్షలను, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, వ్యాధిగ్రస్తులకు ఇస్తున్న మందులను వివరించారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

పనులు వేగవంతం చేయండి

- సమీక్ష సమావేశంలో ఉన్నతాధికారుల సూచన



సీతంపేట: మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

వీరఘట్టం:

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయండి అని మండల ఇంజినీరింగ్ అధికారి కల్యాణి దుర్గ, సూపరింటెండెంట్ వెంకటరమణ ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించిన ఆయన ఏడు సచివాలయాల పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 73 పనులు గుర్తించడం జరిగిందని, ఒక్కో సచివాలయం పరిధిలో పనులకు ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించిందని పేర్కొన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో మొత్తం రూ.1.40 కోట్ల నిధులతో చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించి, చేపట్టిన అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ సిబ్బంది, సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ కె.గీతాంజలి మాట్లాడుతూ బిల్లుల విషయంలో ఎటువంటి అపోహలు వద్దన్నారు. మొత్తం 91 అభివృద్ధి పనులకు గాను రూ.1.65 కోట్లు మంజూరయ్యాయని, ఇప్పటివరకు సోమగండిలో 3, కిండంగి, కుశిమి, కుడ్డపల్లిలో ఒక్కో పని పూర్తయ్యాయన్నారు. మిగతా పనులను ఈఎండీ 1 శాతం చెల్లించి, ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పవన్‌కుమార్, పీఆర్ జేఈ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



వీరఘట్టం: సమీక్షలో మాట్లాడుతున్న మండల ఇంజినీరింగ్ అధికారి కల్యాణిదుర్గ



భామిని: సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఈ గౌరీశంకర్, సందీప్

భామిని: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన అభివృద్ధి పనులపై గురువారం సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు, పీఆర్ ఏఈఈ జి.గౌరీశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అలికాన సందీప్ మాట్లాడుతూ పనులు ఏ మేర పూర్తయ్యాయి, పనులను త్వరితగతం చేయాలని సిబ్బందికి సూచించారు. మొత్తం 16 సచివాలయాల పరిధిలో నిర్మాణ దశలోని పనులు పూర్తి చేయాలని, ప్రారంభం కావాల్సిన పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.

పక్కాగా భూముల రీసర్వే



కొమరాడ: సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ ఆనంద్

భామిని: మండలంలోని సులకజోడు, బిల్లుమడ, పెద్దదిమిలి, చిన్నదిమిలి గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేను పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ గురువారం పరిశీలించారు. పక్కాగా సర్వే చేసి, ఖచ్చితమైన కొలతలతో కూడిన భూమిని రైతుకు అప్పగించాలని సిబ్బందికి ఆయన సూచించారు. రైతుల సమక్షంలోనే భూ సరిహద్దులు గుర్తించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నీలాపు అప్పారావు, మండల సర్వేయర్ తోట రామ్మోహనరావు, ఆర్ఐ రాంబాబు తదితరులు ఉన్నారు.

కొమరాడ: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని జేసీ ఒ.ఆనంద్ సూచించారు. మండలంలోని గుణానపురం గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న ఆర్తాం గ్రామంలో సర్వేలో భాగంగా చేపడుతున్న సరిహద్దు రాళ్ల ఏర్పాటును గురువారం పరిశీలించిన ఆయన సరిహద్దు గుర్తింపు సమయంలో రైతులు దగ్గర ఉండేలా చూడాలన్నారు. రైతుల మధ్య ఎలాంటి తగాదాలు రాకుండా సర్వే చేయాలన్నారు. ఏవైనా అభ్యంతరాలు వ్యక్తమైతే వాటిని కూడా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ స్వామినాయుడు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'బెల్లిడి'



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొండవాడ గ్రామంలో కొన్నిరోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నీ పోటీలు గురువారం ముగిశాయి. మొత్తం 68 జట్లు పాల్గొనగా, ఫైనల్‌కు కొండవాడ, బెల్లిడి గ్రామాల జట్లు చేరుకున్నాయి. సాయంత్రం జరిగిన ఫైనల్స్‌లో టాస్ గెలిచి, బ్యాటింగ్‌కు దిగిన కొండవాడ జట్టు నిర్ణీత 12 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెల్లిడి జట్టు 11 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసి, విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.22000 నగదు, రన్నరప్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.11000 నగదును ఎల్విన్‌పేట ఎస్ఐ షన్ముఖరావు అందజేశారు. కార్యక్రమంలో పీడీ పత్తిక చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

కురుపాం: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని మండలంలోని జర్నలిస్టులంతా కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా మండల కేంద్రంలో తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్‌ను గురువారం కలిసి, వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అలాగే వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు విద్యలో, కుటుంబ సభ్యులకు వైద్యంలో రాయితీ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

పాలకొండ రూరల్: ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి అని ఎంపీడీఓ డొంక త్రినాధులు సూచించారు. మండలంలోని తుమరాడ గ్రామ సచివాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది దృష్టికి వస్తున్న ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అర్హులకే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. సిబ్బంది కూడా విధుల్లో అలసత్వం వహించవద్దని, సమయానికి విధులకు హాజరు కావాలని తెలిపారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

చెత్తనుంచి సంపద తయారీతో ఆర్థికాభివృద్ధి

- డీపీఓ బి.సత్యనారాయణ



పెదభోగిలిలో చెత్తశుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ

సీతానగరం: జిల్లాలోని గ్రామ పంచాయతీల ఆర్థికాభివృద్ధికి చెత్తనుంచి సంపద తయారీకి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం పెదభోగిలి పంచాయతీలో ఉన్న చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. చెత్తనుంచి సంపదతయారీ, వానపాముల పెరుగుదల, వ్యర్థాలతో తయారుచేస్తున్న సేంద్రియ ఎరువుల పట్ల ఉత్పత్తి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మోడల్ చెత్తసంపద కేంద్రంగా పెదభోగిలి కేంద్రాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. చెత్తనుంచి సంపద తయారుచేయడం వల్ల గ్రామ పంచాయతీల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి వీలవుతుందన్నారు. జిల్లాలో రూ.4 కోట్ల 86 లక్షలు ఇంటి పన్ను వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ రూ.4 కోట్ల 2 లక్షలు వసూలు చేసినట్లు తెలియజేశారు. పార్వతీపురం నియోజకవర్గంలో మూడుమండలాల గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ సర్పంచ్‌లు, ఇంజినీరింగ్, వ్యవసాయ సహాయకులకు ఈనెల 28,29 తేదీల్లో బ్యాచ్‌ల వారీగా పెదభోగిలిలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో శిక్షణ నిర్వహిస్తున్నా మని తెలియజేశారు. గ్రామాల్లో ఉండే వ్యవసాయ భూముల వివరాలు, గ్రామకంఠంలో ఉండే నిర్మాణాలు, ఖాళీ స్థలాల సర్వే చేయించడంలో కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వీధిలైట్లు, క్లోరినేషన్ పనులు 15వ ఆర్థిక సంఘం నిధులతోనే చేయించాలని సూచించారు. గ్రీన్ అంబాసిడర్లకు సంబంధించిన గౌరవ వేతనాలు చెల్లించేందుకు పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు 15వ ఆర్థిక సంఘం నిధులు వినియో గించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, కార్యదర్శి జె.వెంకటరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

25న వాహనాల వేలం

వీరఘట్టం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణ పరిధిలో పలు ఎక్సైజ్ దాడుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 25వ తేదీన వేలం వేయనున్నట్లు ఏఎస్ఐ కృష్ణంనాయుడు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఎస్ఐ ఎం.హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఓ ఆటో, నాలుగు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు ఆయన వెల్లడించారు. వేలంపాటలో పాల్గొనే వారంతా ఉదయం 10 గంటలకు తమ ఆధార్‌కార్డుతో హాజరు కావాలని కోరారు.

లక్ష్మీ నృసింహస్వామికి పుష్పాలంకరణ



సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీనృసింహస్వామిని గురువారం ఉదయం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. స్వామివారిని అలంకరించిన అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ప్రతి గురువారం స్వామివారిని దర్శించుకునేందుకు నాలుగు మండలాల నుంచి వేకువ జామునుంచే పూజాసామగ్రితో మొక్కులు తీర్చుకునేందుకు దూర ప్రాంతాలనుంచి భక్తులు వస్తారన్నారు. ఈ నేపథ్యంలో భక్తులు రాకముందే స్వామివారిని అలంకరించి పూజలు చేస్తామని తెలిపారు. భక్తులు పాల్గొనే రద్దీని బట్టి బ్యాచ్‌లుగా విభజించి అర్చనలు చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలవరకూ పూజలు, అభిషేకాలు చేశామని చెప్పారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులందరికీ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

ఈదురుగాలులతో పంట నష్టం

బలిజిపేట: మండలంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలుల ప్రభావానికి అరటి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అందులో భాగంగా చిలకలపల్లిలో ఎ.మోహనరావుకు చెందిన 30సెంట్లలో అరటి, ఎ.జయమ్మకు చెందిన 70సెంట్ల మొక్కజొన్న పంట నేలకొరిగినట్లు సంబంధిత రైతులు తెలిపారు. అలాగే మండలంలోని మరి కొన్ని గ్రామాలలో కూడా పంటకు నష్టం వాటిల్లిందని ఆయా గ్రామాల రైతులు తెలిపారు. పంట నష్టాన్ని అధికారులు గుర్తించి పరిహారాలను అంచనా వేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రెండు వారాలకు మించిన దగ్గు క్షయ కావచ్చు

సాలూరు: రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం క్షయ వ్యాధి కావచ్చని ఆర్ఎంఓ డాక్టర్ రత్నకుమారి, పీపీ యూనిట్ వైద్యాధికారి, వైద్యులు డా.సురేష్ చంద్రదేవ్, డాక్టర్ శాంతిప్రియ, అనిల్‌కుమార్‌లు అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సందర్భంగా గురువారం పట్టణంలో ఏరియా ఆస్పత్రి నుంచి మెయిన్‌రోడ్డు వరకు వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, దగ్గేటప్పుడు కఫం ద్వారా రక్తపు జీరలు పడడం వంటి టీబీ వ్యాధి లక్షణాలను వివరించారు. ఈ లక్షణాలు సోకిన వ్యక్తులు స్థానిక వైద్యారోగ్య సిబ్బంది ద్వారా ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించి కఫం పరీక్ష చేసుకోవాలని సూచించారు. చికిత్స గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, టీబీ సూపర్‌వైజర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో వైద్యారోగ్య సిబ్బంది

భగత్‌సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకం



సీతంపేట: మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకుడు అప్పారావు



పాలకొండ: భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సీతంపేట: భగత్‌సింగ్ స్వాతంత్ర్య పోరాటం స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. స్థానిక గిరిజన సంఘ కార్యాలయంలో భాషా వలంటీర్ల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు బి.అప్పారావు మాట్లాడుతూ బ్రిటిష్ బానిస సంకెళ్ల నుంచి భారతదేశానికి విముక్తి కలిగించేందుకు ఆయన ఉరితాడునే పూలమాలగా స్వీకరించి, ప్రాణాలు త్యజించారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని, యువత అన్యాయ, అక్రమాలపై పోరాడాలననారు. కార్యక్రమంలో ఎం.తిరుపతిరావు, సాంబయ్య, శ్రీరాములు, డొంబు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్ దగ్గర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఐటీయూ జిల్లా నాయకుడు దావాల రమణారావు, ప్రజాసంఘాల నేతలు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ యవ్వన దశలో భారతదేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యజించిన గొప్ప వ్యక్తి భగత్‌సింగ్ అని, ఆయన పోరాట స్ఫూర్తితో యువత ప్రజాసమస్యలపై పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు కాదరావు, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు గుండు సుధీర్, కేవీపీఎస్ నాయకుడు దూసి దుర్గారావు, కార్మిక సంఘాల నాయకులు బి.పట్టాభి, కె.శ్రీనివాసరావు, పి.సంగమేషు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గంగునాయుడు

పాలకొండ: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దావాల రమణారావు కోరారు. ఇదే విషయమై స్థానిక పట్టణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో గురువారం సమావేశమైన ఆయన ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కార్మికులకు కూడా తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోదీ సర్కారును వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. నోట్ల రద్దు, జీఎస్‌టీ, రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నల్లచట్టాలు, గ్యాస్ ధరల పెంపును ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు.

కురుపాం: కేంద్రంలోని మోదీ సర్కారు ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గుంగునాయుడు, సీపీఎం నాయకుడు కూరంగి సీతారాం పిలుపునిచ్చారు. ఇదే విషయమై రూపొందించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం పక్కనబెట్టి, ధనవంతులైన అదానీ, అంబానీలకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు, ఉపాధి భద్రత, పీఎఫ్, పెన్షన్, ఆరోగ్య సౌకర్యాలతో కూడిన సమగ్ర చట్టం కలగానే మిగిలిపోయిందన్నారు. ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తూ బడ్జెట్ కేటాయింపుల్లో రూ.30 వేల కోట్ల కోత పెట్టిందన్నారు. దీంతో వేతనదారులకు తీరని అన్యాయం చేసిందన్నారు.

ఆవుదూడల ప్రదర్శన



ఆవుదూడల ప్రదర్శనలో పాడిరైతులు

భామిని: మండలంలోని కోసలి గ్రామంలో ఆవుదూడల ప్రదర్శన గురువారం చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు బి.శ్రీనివాస్ మాట్లాడుతూ దూడల అభివృద్ధితోనే పాడి సంపద, పాల ఉత్పత్తి సాధ్యమన్నారు. పాడిసంపదతో స్వయం ఉపాధి పొందవచ్చని, ఈ నేపథ్యంలో వాటిని సంరక్షించుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా పశువులను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ పి.రాధాకుమారి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మెనూలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.డి.వి.రమణ



కోటిపాం గ్రామంలో మధ్యాహ్న భోజన వంటకాలపై ఆరాతీస్తున్న డీఈఓ రమణ

కొమరాడ: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాల్లో మెనూ అమలు చేయకపోతే చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ) ఎస్.డి.వి.రమణ హెచ్చరించారు. మండలంలోని కొమరాడ, కోటిపాం జెడ్పీ ఉన్నత పాఠశాలలను గురువారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయుల బోధనా తీరు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని, విద్యార్థులకు కూడా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని సిబ్బందిని కోరారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అనంతరం పిల్లల కోసం వండిన మధ్యాహ్న భోజన వంటకాలను చూసిన ఆయన మెనూ ప్రకారం ప్రతిరోజూ వండే వంటకాలు ఉండాలన్నారు. వంటకాలు కూడా రుచి, శుచి కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యమే ప్రధానంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు.

అలరించిన భాగవత సప్తాహం

పాలకొండ రూరల్: స్థానిక సత్యసాయి మందిరంలో గురువారం నిర్వహించిన భాగవత సప్తాహం(భాగవత కాలక్షేపం) అలరించింది. ఆధ్యాత్మిక వక్త, వేద పండితులు రామశేషు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంచి పనుల ద్వారా మోక్ష మార్గం పొందడం, భగవద్గీతలోని ముఖ్యాంశాలను భక్తులకు వివరించారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి భక్తులంతా హాజరు కావాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఆర్.కిశోర్ కోరారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం, సీతంపేట

బహిరంగ వేలం పాట

రేఖా సంఖ్య. 8/2023, తే. 23.03.2023 ది

పార్వతీపురం మన్యం జిల్లా, సీతంపేట మండలం, సీతంపేట గ్రామ పంచాయితీకి చెందిన ఈ దిగువ తక్తాలో చూపబడిన గుత్తలు 2023-2024 సంవత్సరమునకు అనగా గుత్త హక్కు జారీ చేయబడిన తేదీ నుండి ఆశీలు వసూలు చేసుకొనేందుకై బహిరంగ వేలం ద్వారా రోజువారి మార్కెట్ మరియు సంత గుత్త హక్కు ఇచ్చుటకు, అనగా తే 29.03.2023ది బుధవారం ఉదయం 11.00 గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయం, సీతంపేట వద్ద కార్యనిర్వాహణాధికారి / పంచాయితీ కార్యదర్శి వారిచే బహిరంగ వేలంపాట నిర్వహించబడును. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన వారు ఈ క్రింది తక్తాలో చూపినవిధంగా ఆ యొక్క గుత్తలు / ఏజాలకు సంబంధించి కాలం నెం.3లో చూపిన విలువకు తక్కువ కాని సామర్థ్యం కలిగిన అధికారి వారి నుండి పొందిన మోతుబరి ధృవపత్రము దాఖలు చేయుట లేదా సదరు మొత్తము నగదు రూపములో చెల్లింపుతో పాటు కాలం నెం.4లో చూపిన ధరావత్తు సైతము చెల్లించి వేలంపాటలో పాల్గొనవలెను.

తక్తా-1

క్రమ సంఖ్య	గుత్త వివరములు	దాఖలు చేయబడిన సాల్వెన్సీ విలువ	చెల్లింపవలసిన ధరావత్తు మొత్తము
1	2	3	4
1	రోజువారి మార్కెట్	1,00,000-00	10,000-00
2	వారపు సంత	1,00,000-00	10,000-00

గమనిక: 1.గ్రామ పంచాయితీకి ఏవిధమైన బకాయిలు ఉన్నవారు వేలంపాటలో పాల్గొనుటకు అనర్హులు. 2.వేలంపాట వాయిదా వేయుటకు, మరియు రద్దు చేయుటకు గ్రామ పంచాయితీకి పూర్తి అధికారం కలదు. 3.అవసరమైన సమాచారము కార్యాలయం పనిచేయు వేళలలో సంప్రదించవచ్చును. 4.అవసరమైన మోతుబరి ధృవపత్రములు వేలంపాటకు ఒక గంట ముందుగానే సమర్పించవలసి వుంటుంది.

ఇట్లు

కార్యనిర్వాహణాధికారి / పంచాయితీ కార్యదర్శి, సీతంపేట.